

'సమయాన్ని వృథా చేయకుండా ఐటీఐలో శిక్షణ పొందాలి'

బిచ్కుంద, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో పదో తరగతి పాస్ అయిన యువకులతో డీపీవో శ్రీనివాస్ సమావేశమయ్యారు. సమయాన్ని వృథా చేయకుండా ఐటీఐ కళాశాలలో అడ్వాన్స్ టెక్నాలజీ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సంవత్సర కాలం కోర్సుల అనంతరం ధ్రువీకరణ పత్రంతో భవిష్యత్తు అభివృద్ధి కోసం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇలాంటి మంచి అవకాశాన్ని మీతో పాటు ఇతరులకు కూడా అవగాహన కల్పించి కోర్సుల్లో చేరేవిధంగా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీవో నాగరాజు, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



పండుగకు ముందే.. పేకాట!

- దీపావళికి పేకాట రహస్య అడ్డాలు సిద్ధం?
- పండుగకు ముందే జోరుగా సాగుతున్న పేకాట
- పోలీసు దాడులు జరుగుతున్నా ఆగని దందా
- జిల్లా సరిహద్దుల్లో జోరుగా పేకాట
- మండల, గ్రామాల్లో పంట పొలాలు, అటవీ ప్రాంతాలే అడ్డాలు
- జిల్లాలో రోజు రోజుకూ చేతులు మారుతున్న లక్షలాది రూపాయలు
- క్షేత్రస్థాయిలో పోలీసులు నిఘా పెట్టాల్సిందే..

కామారెడ్డి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): దీపావళికి జిల్లాలో జోరుగా పేకాట నిర్వహించేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. జిల్లా సరిహద్దు ప్రాంతాలతో పాటు అటవీ ప్రాంతాల్లో, మారుమూల గ్రామాల్లో, పట్టణాల్లోని పలు రహస్య ప్రాంతాల్లో పేకాట అడ్డాలను ఏర్పాటు చేసి జూదాన్ని ఆడిపించేందుకు నిర్వాహకులు ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం. దీపావళి పండుగకు ముందే పేకాట జోరుగా నిర్వహిస్తున్నారు. దీపావళి పండుగ సందర్భంగా పేకాటతో కట్టలు తెగడం కోట్లాది రూపాయలు చేతులు మారడం పరపాటిగా మారుతోంది. పండుగ రోజు పేకాట నిరోధించడంలో పోలీసుశాఖ ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ నిలువరించలేక పోతున్నారు.

జుక్కల్, బాన్సువాడ ప్రాంతాల్లో జోరుగా జూదం

జిల్లాలోని జుక్కల్, బాన్సువాడ నియోజకవర్గాల పరిధిలో పేకాట జోరుగా సాగుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఈ నియోజకవర్గాల పరిధిలో పలు మండలాల్లో పోలీసులు పేకాట స్థావరాలపై దాడులు చేసి పట్టుకోవడమే ఇందుకు నిదర్శనం. అయితే దీపావళి పండుగ సందర్భంగా పేకాట ఆడుతున్నట్లు తెలుస్తున్నప్పటికీ ఇతర సమయాల్లోను ఈప్రాంతాల్లో కొందరు గుట్టుగా పేకాట క్లబ్‌లను నడుపుతున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా నస్రూల్లాబాద్, మద్నూర్, జుక్కల్, బిచ్కుంద, బీర్కూర్, బాన్సువాడ సరిహద్దు మండలాల్లో పక్క రాష్ట్రాలకు చెందిన పేకాట నిర్వాహకులతో జిల్లాకు చెందిన నిర్వాహకులు కలిసి పేకాట క్లబ్‌లను నిర్వహిస్తున్నట్లు నిఘా వర్గాల ద్వారా వెల్లడైంది. జిల్లాకు చెందిన పేకాట రాయుళ్లు ప్రతీరోజు అక్కడికి వెళ్లి జూదం ఆడుతూ లక్షల డబ్బులను కోల్పోతున్నారు. దీంతో వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. దీపావళి పండుగ సందర్భంగా ఏకంగా ఈ సరిహద్దు ప్రాంతాలైన జిల్లాలోని పలు మారుమూల గ్రామాల్లో పేకాట జోరుగా నిర్వహిస్తున్నారు. పండుగ వేళ ప్రత్యేక అడ్డాలను ఏర్పాటు చేసుకుని జూదం ఆడిపిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతాల్లోని పేకాట అడ్డాలపై జిల్లా పోలీసు యంత్రాంగం నిఘా పెట్టి జూదాన్ని నిర్మూలించాలని బాధిత కుటుంబాలు కోరుతున్నారు.

పట్టణ ప్రాంతాల్లోనూ..

కామారెడ్డి పట్టణంతో పాటు బాన్సువాడ, ఎల్లారెడ్డి డివిజన్లలోను దాదాపు పేకాట క్లబ్బులను పోలీసులు మూసివేయించారు. దీంతో పేకాట ప్రియులు పట్టణాల్లోని అపార్ట్‌మెంట్లు, స్టార్ హోటళ్లు, లాడ్జీలు, దాబాలతో పాటు శివారు ప్రాంతాల్లో ప్రతినిత్యం గుట్టుచప్పుడు కాకుండా ఆడుతున్నారు. క్లబ్బులు బంద్ కావడంతో జూదరులు రోజుకో అడ్డాను మారుస్తున్నారు. ఈ అడ్డాలకు పేకాట ఆడడానికి వచ్చే వ్యక్తులను ఆట ముగిసేంత వరకు బయటకు వెళ్లకూడదనే నిబంధన పెడుతూ నిర్వాహకులు పేకాటను కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. పట్టణంలోని కొన్నిస్టార్ హోటళ్లలో విచ్చలవిడిగా పేకాట ఆడుతున్నట్లు సమాచారం. హోటళ్లలో ఉండే రూమ్ రెంట్‌కు అదనంగా రెండు మూడింతలు డబ్బులు చెల్లిస్తూ నాలుగైదు రూమ్‌లను బుక్ చేసుకుని పేకాట నిర్వాహకులు దర్జాగా నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. పోలీసులు ఎక్కడ తనిఖీలు చేస్తారోనని జాగ్రత్త పడుతూ రోజురోజుకూ హోటళ్లలో అడ్డాలను మారుస్తున్నారు. ఇక లాడ్జీల్లో పోలీసులు తనిఖీలకు వచ్చారంటే చాలు సంబంధిత మేనేజర్లు, అందులో ఉండే బాయ్‌ల ద్వారా పేకాట రాయుళ్లకు సమాచారం చేరవేయడంతో పేక ముక్కలను దాచేసి అక్కడ మద్యం తాగుతున్నట్లు మద్యం బాటిళ్లు, గ్లాసులు ముందు పెట్టుకుని ఉంటున్నారు. అంతే కాకుండా జిల్లా కేంద్రంలోని ప్రధానంగా అపార్టుమెంట్లలో జూదం జోరుగా కొనసాగుతున్నట్లు నిఘా వర్గాల ద్వారా వెల్లడైంది. దీంతో పాటు జిల్లాలోని మండలాల్లో, గ్రామాల్లో సైతం జూదం జోరుగా కొనసాగుతోంది. ఈ ప్రాంతాలకు అధికంగా వ్యాపారవేత్తలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఉపాధ్యాయులు వెళుతున్నట్లు తెలిసింది.

అడ్డాగా అటవీ ప్రాంతాలు

జిల్లాలో అధిక శాతం అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఈ ప్రాంతాల్లో

(మిగతా 6వ పేజీలో)



వైద్య ఆరోగ్యశాఖలో నిబంధనల అమలెక్కడ?

- పీసీపీఎన్‌డీటీ, డీఆర్‌ఏ సమావేశాలు అంతంత మాత్రమే
- ఆసుపత్రులు, స్కానింగ్, డయాగ్నస్టిక్ సెంటర్లలో తనిఖీలు కరువు
- ఫిర్యాదులు వచ్చినా చర్యలు శూన్యం
- తనిఖీలు లేకపోవడంతో ఇష్టారీతిన వ్యవహరిస్తున్న నిర్వాహకులు

కామారెడ్డి టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో నిబంధనల అమలు మచ్చుకైన కనిపించడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అధికారులు వారి విభాగాల పట్ల ఏ విధమైన అవగాహన కలిగి ఉండాలనేది సైతం వారికి తెలియకుండా పోతుందంటే వారి పనితీరు ఎలాగుందో అర్థం చేసుకోవచ్చు. జిల్లాలో పలుచోట్ల ఇష్టారీతిన ఆసుపత్రులు, స్కానింగ్, డయాగ్నస్టిక్ సెంటర్లను ఏర్పాటు చేయడమే కాకుండా ప్రజల వద్ద నుంచి లేనిరోగాల పేరుతో దోచుకుంటున్నా కనీసం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదైన సంఘటన జరిగినప్పుడు ఫిర్యాదులు చేస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెబుతున్నారని, తీరా ఫిర్యాదులు వస్తే కాలయాపన చేసి తూతూ మంత్రంగా తనిఖీలు చేస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అధికారులు వారు చేయాల్సిన పని సరిగా చేయకపోవడం వల్లనే లింగ నిర్ధారణ, డెంగ్యూ లేకున్నా ఉన్నట్లు తప్పుడు రిపోర్టులు, ఒక ఆసుపత్రి పేరు మీద రిజిస్ట్రేషన్ ఉంటే మరో ఆసుపత్రి పేరుతో నడపడం లాంటివి ఇలా అనేక రకాలుగా నిబంధనల బేఖాతారు జరుగుతుంది. గత కొన్ని సంవత్సరాలుగా పలువురు ప్రోగ్రాం ఆఫీసర్లు తూతూ మంత్రంగా తనిఖీలు చేయడంతోనే సరైన పర్యవేక్షణ లేకుండా పోతుందని దీంతో ఆయా ఆసుపత్రులు, స్కానింగ్, డయాగ్నస్టిక్ సెంటర్ల నిర్వాహకులు తమకు నచ్చినవిధంగా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయం

పీసీపీఎన్‌డీటీ, డీఆర్‌ఏ సమావేశాలు అంతంత మాత్రమే


జిల్లా ఏర్పాటు అయిన తర్వాత జిల్లా వైద్యఆరోగ్యశాఖ విభాగం ఏర్పడి దాదాపు 8 సంవత్సరాలు గడుస్తోంది. ఇప్పటి వరకు పీసీపీఎన్‌డిటీ(ప్రీ కన్సెప్షన్ అండ్ ప్రీనాటల్ డయాగ్నస్టిక్ టెక్నిక్స్), డీఆర్‌ఏ(డిస్ట్రిక్ రిజిస్ట్రేషన్ అథారిటి) సమావేశాలు కేవలం పదుల సంఖ్యలోనే నిర్వహించారంటే ఏ స్థాయిలో అధికారులు పని చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. పీసీపీఎన్‌డీటీ యాక్ట్ కింద నిబంధలకు లోబడి స్కానింగ్ సెంటర్‌లకు అనుమతులు ఇస్తారు. స్కానింగ్ సెంటర్‌లకు అనుమతులు ఇచ్చేముందు ఈ యాక్ట్‌లో అన్ని నిబంధనలు అమలు చేసేలా చూడడంతో పాటు ప్రతీనెల 5 చొప్పున తనిఖీలు చేపట్టాల్సి ఉంటుంది. అదేవిధంగా పీసీపీఎన్‌డీటీ యాక్ట్ అమలులో భాగంగా కలెక్టర్ చైర్మన్‌గా డీఎంహెచ్‌వో కన్వీనర్‌గా, ఎస్పీ, ఒక ఎన్‌జీవో, ఒక లీగల్ డిపార్ట్‌మెంట్ నుంచి అడ్వైజర్‌లు ఉండాలి. ప్రతీ మూడు నెలలకోసారి సమావేశమై పీసీపీఎన్‌డీటీ యాక్ట్ పనితీరు, అధికారులు తనిఖీలకు సంబంధించిన చాట్‌ను పరిశీలించాల్సి ఉంటుంది. ఈ సమావేశ నిర్వహణపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. ఇదే తరహాలో ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్‌ల అనుమతులకు క్లినికల్ ఎస్టాబిలిష్‌మెంట్ యాక్ట్ ద్వారా అనుమతులు జారీ చేస్తారు. దీనికి సైతం డీఆర్‌ఏ సమావేశాలు ప్రతీ మూడు నెలలకో సారి నిర్వహించాలి. ఇందులో కలెక్టర్ చైర్మన్‌గా, కన్వీనర్‌గా డీఎంహెచ్‌వో, ఐఎంఏ సభ్యులు, ఇతరులు ఉంటారు. ఆసుపత్రుల పనితీరు, డయాగ్నస్టిక్ సెంటర్‌లలో తప్పుడు రిపోర్టులు ఇచ్చిన వారిపై చర్యలు, ఒక ఆసుపత్రి పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకుని మరో ఆసుపత్రితో నడపడం, డాక్టర్‌ల పేర్లు మార్పు ఇలా అనేక రకాలుగా చర్చించి చర్యలు తీసుకోవాలి. గతంలో కొందరు అధికారులు ఇష్టారీతిన అనుమతులు ఇవ్వడం నిబంధనలు పాటించకపోవడం లాంటివి చేశారని అందుకే డీఆర్‌ఏ సమావేశాలలో జిల్లా స్థాయి ఉన్నతాధికారులు ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని సమావేశాలు అంతంత మాత్రంగానే నిర్వహించేలా చూస్తున్నారని సమాచారం.

ఆసుపత్రులు, స్కానింగ్, డయాగ్నస్టిక్ సెంటర్లలో తనిఖీలు కరువు

వైద్య ఆరోగ్యశాఖ ఆసుపత్రులు, స్కానింగ్, డయాగ్నస్టిక్ సెంటర్లకు అనుమతులు ఇవ్వడంతో పాటు ఆయా ఆసుపత్రుల్లో, స్కానింగ్, డయాగ్నిస్టిక్ సెంటర్‌లలో పీసీపీఎన్‌డీటీ, క్లినికల్ ఎస్టాబిలిష్‌మెంట్ యాక్ట్‌లు ఏ విధంగా అమలు అవుతున్నాయనేది తనిఖీలు చేయాల్సి ఉంటుంది. ప్రతీనెల 5 చొప్పున తనిఖీలు చేసి ఆ చాట్‌ను మూడు నెలలకోసారి డీఆర్‌ఏ ముందు ఉంచాలి. పైగా ఎప్పుడు తనిఖీలు చేసిన వైద్య ఆరోగ్యశాఖలో ఉన్న డెమో సెక్షన్ ద్వారా ప్రజలకు తెలిసేలా మీడియాకు విడుదల చేయాల్సి ఉంటుంది. డీఎంహెచ్‌వో అనుమతితో తనిఖీలు చేపట్టిన పీవోలు ఎక్కడైన నిబంధనలు బేఖాతారు చేసిన వారిపై ఏ విధమైన చర్యలు తీసుకున్నారనే విషయాన్ని వెల్లడించాలి. కానీ చాలా వరకు ఈ నిబంధన అమలు కావడం లేదు. అసలు తనిఖీలు గత కొన్ని సంవత్సరాలుగా తూతూ మంత్రంగానే చేస్తున్నారని ఒకవేళ మీడియా ద్వారా బయటకు వస్తే తనిఖీల్లో చూపుతున్న నిర్లక్ష్యం బయటపడుతుందనే అధికారులు డెమో సెక్షన్ ద్వారా వివరాలు వెల్లడించడంలేదని తెలుస్తోంది. ఇప్పటి వరకు డెమో సెక్షన్ ద్వారా ఎన్ని తనిఖీల విషయాలు బయటకు చెప్పారనేది జిల్లా ఉన్నతాధికారులు పరిశీలిస్తే వారి పనితీరు బయటపడే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే కొందరు అధికారులకు వైద్య ఆరోగ్యశాఖలో సొంత వాహనాలు ఉండడంతో తనిఖీలకు వెళ్లేందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారని విమర్శలు లేకపోలేదు. తనిఖీలు వెళ్లకుండా వెళ్లినట్లు బిల్లులు లేపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై కలెక్టర్ దృష్టిసారిస్తే అధికారుల పనితీరు బయటపడుతుందని అభిప్రాయాలు సొంతశాఖలోని సిబ్బంది నుంచే వినిపిస్తోంది.

కొనసాగుతున్న నిజాంసాగర్ నీటి విడుదల

నిజాంసాగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ ప్రాజెక్టులోనికి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు క్రమేపీ వచ్చి చేరుతునే ఉంది. ఆదివారం నాటికి నిజాంసాగర్ ప్రాజెక్టులోనికి 3,200 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో నీటి పారుదల శాఖ అధికారులు వీఆర్ నెంబర్ 5లోని ఒక గేటు ఎత్తి 3,200 క్యూసెక్కుల నీటిని మంజీరా నదిలోకి వదలి వేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 1405 అడుగులు కాగా 1404.92 అడుగుల నీటి సామర్థ్యాన్ని నిల్వ చేస్తూ ఎగువ ప్రాంతం నుంచి వచ్చే నీటిని నేరుగా మంజీరా నదిలోనికి వదిలి వేస్తూనే ఉన్నారు. ప్రాజెక్టులో 17.802 టీఎంసీలు గాను 17.689 టీఎంసీల నిల్వ నీటిని ఉంచుతున్నట్లు నీటి పారుదల శాఖ అధికారి శివప్రసాద్ తెలిపారు.



ప్రాజెక్టు గేటు ద్వారా మంజీరా నదిలోనికి విడుదలవుతున్న నీరు

రేపు నిజామాబాద్‌కు బీసీ కమిషన్ బృందం రాక

కామారెడ్డి టౌన్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల వారిగా కల్పించాల్సిన అవసరమైన రిజర్వేషన్ల దామాషాను పేర్కొనే విషయంలో ఆసక్తి కలిగిన వారి అభిప్రాయాలను తీసుకునేందుకు వీలుగా తెలంగాణ బీసీ కమిషన్ ప్రతినిధులు మంగళవారం నిజామాబాద్‌కు వస్తున్నట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాకు సంబంధించి నిజామాబాద్ కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటల నుంచి 4 గంటల వరకు కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు అభిప్రాయాలు తెలియజేయాలనుకునేవారు హాజరుకావచ్చని తెలిపారు. అభ్యర్థనలతో పాటు నిర్దేశిత నమూనాలో వెరిఫికేషన్ అఫిడవిట్ ఆరుసెట్లను తెలుగు లేదా ఆంగ్లభాషలో ఇవ్వాల్సి ఉంటుందన్నారు. వారి వాదనలకు మద్దతుగా వారి వద్ద ఉన్న సమాచారం, మెటీరియల్, సాక్ష్యాలను, సంబంధిత కేసుల వివరాలను పేర్కొంటూ, సమర్పణలు, అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలను కమిషన్‌కు నివేదించవచ్చని కలెక్టర్ తెలిపారు.



ఆలయానికి భారీగా తరలివచ్చిన భక్తులు

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

మాచారెడ్డి, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మాచారెడ్డి మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు, హారతులు వంటివి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పుట్టువెంట్రుకలు, వాహనపూజలు ఇతర మొక్కులను తీర్చుకుని స్వామి వారిని దర్శించుకున్నారు. సంతానం లేని మహిళలు ఆలయప్రాంగణంలో సంతాన దేవతకు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీధర్‌రావు, ఆలయ అర్చకులు, సిబ్బంది సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రైతన్నల చూపు ప్రైవేట్ మిల్లర్ల వైపు



- పంట చేతికి రావడంతో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు
- కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినా.. మొదలవ్వని కొనుగోళ్లు
- ప్రైవేటు మిల్లర్ల వైపు చూస్తున్న రైతులు

5

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



రెంజర్లలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 1995-96 పూర్వవిద్యార్థులు

ముప్కాల్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండలంలోని రెంజర్ల ఉన్నత పాఠశాల పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంగా ఘనంగా నిర్వహించారు. 1995-96 సంవత్సరానికి చెందిన పదో తరగతి పూర్వవిద్యార్థులు 29ఏళ్ల తర్వాత ఒకే చోట కలుసుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరిం చుకొని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి గురువులు ప్రధానోపాధ్యాయులు కొండ్ర ధన్‌పాల్‌ల దంపతులకు గంగాధర్, సాయిరెడ్డి, ఉపాధ్యా యులతో పాటు సుభాషిణిని శాలువతో సత్కరించుకొని మెమోంటోలు అందజేశారు. ఉపాధ్యాయులు అనాటి విద్యార్థుల చిలిపి చెష్టాలను గుర్తు చేసు కున్నారు. విద్యార్థులు ఒకరినొకరు కష్టసుఖాలు తెలుసుకొని ఏటువంటి అపద సమయంలోనైనా ఒకరినొకరు సహకరించుకుంటామని తమ మనోభావాలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మగ్గిడి ముత్యంరెడ్డి, నిమ్మల శ్రీనివాస్, తోపారం ప్రసాద్, బద్దం రఘుపతి, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

బాల్కొండలో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



బాల్కొండలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 2005-06 పూర్వవిద్యార్థులు

ముప్కాల్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి) బాల్కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005-06 పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంగా ఘనంగా నిర్వహించారు. 19ఏళ్ళ తర్వాత ఒకే చోట కలుసుకొని తాము చదువుకున్న తరగతి గదుల్లో చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా తాము బోదించిన ఉపాధ్యాయులను పూర్వవిద్యార్థులు శాలువ, మెమోంటోలతో ఘనంగా సత్కరించారు. ఒకరినొకరు స్నేహసంబంధాలు పెంపొందించుకొని సహకరించుకోవాలని ఉపాధ్యాయు లు వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థిని, విద్యార్థులు, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

డాక్టర్ బాపురెడ్డి ఇకలేరు



ఖిల్లా, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ నగరానికి చెందిన ప్ర ముఖ వైద్యుడు, తెలంగాణ వాది డాక్టర్ బాపురెడ్డి (75) ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు.సంవత్సరం కాలంగా ఆయన హైదరాబాద్‌లోనే ఉంటు న్నారు. .ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన భౌతిక కాయాన్ని హైదరాబాద్‌లోని కొంపల్లిలో సోమవారం అంత్యక్రియలు నిర్వహించను న్నారు. ఆయన మృతి పట్ల జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, వైద్యులు, రాజకీయ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవు

బోధన్‌రూరల్,అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి అన్నారు. బోధన్ మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో శనివారం అర్ధరాత్రి పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఎవరైనా పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పేకాట నిర్వహించిన సమాచారం గ్రామస్థులు ఇచ్చినట్లయితే సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామన్నారు.

ఐటీఐలో 7వ విడత స్పాట్ అడ్మిషన్‌ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం కోటిరెడ్డి

కమ్మర్‌పల్లి,అక్టోబరు 27:(ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ ఐటీఐ కమ్మర్‌పల్లి (బషీరాబాద్)లోని అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌లో వివిధ కోర్సులలో ఆసక్తిగల విద్యార్థులు స్పాట్ అడ్మిషన్‌కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోటిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. స్పాట్ అడ్మిషన్ల కోసం ఈనెల 30 వరకు ప్రతిరోజు అడ్మిషన్లకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. మనుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ (ఒక ఏడాది)40 సీట్లు, ఇండస్ట్రియల్ రోబోటిక్సరియ డిజిటల్ మనుఫాక్చరింగ్ కోర్సు(ఒక ఏడాది)40 సీట్లు, ఆర్టిసస్ యుసింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్(ఒక ఏడాది) 20 సీట్లు, బేసిక్ డిసిగ్నేర్మరియ విర్త్‌అవాల్ వెరిఫైర్ మెకానిక్ (రెండు సంవత్సరాలకోర్స్)24 సీట్లు, అడ్వాన్స్ మెశినింగ్‌టోక్నీషియన్ సీఎస్‌సి (రెండు సంవత్సరాలకోర్స్)24 సీట్లు, మెకానిక్ ఎలక్ట్రిక్ వేహికిల్ (రెండు సంవత్సరాల కోర్స్)24 సీట్లు ఖాళీగా ఉన్నాయని ఆసక్తిగల విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో పాటు అన్‌లైన్ దరకాస్తులు చేసుకోవాలన్నారు. కోర్సుల పూర్తి వివారాలకోసం వెబ్‌సైడ్స్ హెచ్ టీ టీ పీ ఎస్// ఐటీఐ తెలంగాణ. జీవోటి.ఇన్ చూడాలని సూచించారు. వీక్‌ఇన్‌అడ్మీషన్‌లలో ఏలాంటి రిజర్వేషన్‌లు ఉండవని, అడ్వాన్స్ కోర్సులు చదివిన విద్యార్థులకు ప్రస్తుతం మల్టీనేషనల్ కంపెనీలలో, ప్రభుత్వ రంగ సంస్థలలో ఉద్యోగ అవకాశాలు, విదేశీ ఉద్యోగ అవకాశాలు ఉంటాయని, విదేశాలకు వల్లేందుకు సర్టిఫికెట్‌లు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. పూర్తి వివరాలకోసం 8106794500 , 9491566890 లకు సంప్రదించాలన్నారు.

మెండోరాలో స్మారక క్రికెట్ వాలీబాల్ పోటీలు

మెండోర, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నేటి నుంచి మూడు రోజుల పాటు అంబేదకర్ యూత్ ఆధ్వర్యంలో స్మారక కబడ్డీ, వాలీబాల్ పోటీలు జరగనున్నాయని టోర్నీ నిర్వాహకులు గుంటి నిశాంత్, మాకూరి మహేష్, మాకూరి రూపేష్, గుంటి శేఖర్ తెలిపారు. ఈ సందర్భం గా మాకూరి వినోద్, గుంటి రవిల స్మారకార్థం కబడ్డీ, వాలీబాల్ పోటీలు జరగనున్నాయని, కబడ్డీ పోటీల్లో ప్రొ కబడ్డి తరహాలో నిర్వహిస్తున్నట్టు ప్రత్యేక వ్యాయమ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో పోటీలు జరగనున్నాయని మరిన్ని వివరాలకు 9951220892, 9542162416నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఒక డీఏ ప్రకటనతో ఉద్యోగాల్లో తీవ్ర అసంతృప్తి

ముప్కాల్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి) ప్రభుత్వం ఒక డీఏ ప్రకటించడంతో ఉద్యోగులు అసంతృప్తిగా ఉన్నామని టీఎస్‌యు టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు, ప్రధానకార్యదర్శులు డి.సత్యానంద్, ఓ.రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సందర్భంగా అధికారంలోకి వచ్చిన 15రోజుల్లో బకాయి పడిన మూడు వాయిదాల డీఏ విడుదల చేస్తామని మెనిఫెస్టోలో పేర్కొన్న అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అర్థం చేసుకొని గత పది నెలలుగా ఓపిక పట్టామని, తదుపరి మరో రెండు వాయిదాలు బకాయి పడడంతో ఉపాధ్యాయుల్లో ఆందోళన మొదలైందన్నారు. మినమాయ ధరల సూచిక అనుగుణంగా ప్రతీ ఆరు నెలలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యం ప్రకటించ బడుతుందని, గత కొన్నేళ్లుగా రాష్ట్రంలో ఈ అనావాయితీని పటించడంలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఐదు వాయిదాల కరువు భత్యం డీఏ పెండింగ్‌లో ఉన్న ఒక వాయిదా అని విడుదల చేయడం విచారకరంగా ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ నిర్ణయాన్ని పునసమీక్షించుకొని టీఎస్‌యుటీఎస్ కోరుతుందన్నారు.

ఐఎన్‌టీయూసీ 327కు 70 వసంతాలు

సుభాష్‌నగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ యూనియన్ 327 ఐఎన్‌టీయూసీ 70 వసంతాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పవర్‌హౌజ్ కంపౌండ్ కార్యాలయ ఆవరణలో ఐఎన్‌టీయూ కార్యాలయం ఎదుట ఆదివారం జిల్లా కార్యదర్శి పుదారి గంగాధర్ యూనియన్ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 70 సంవత్సరాల నుంచి ఐఎన్‌టీయూసీ యూనియన్ కార్మిక శ్రేయస్సుకై పనిచేస్తుందని అన్నారు. ఆర్టీసి కార్మికులకు ఏపీఎస్‌సీబీ స్టాండింగ్ రూల్స్ వర్తింపజేయడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఆనవాళ్లు కోల్పోయిన తూములు, కాల్వలు

● కాలువలో నిండిన చెత్తాచెదారం ● దిగువన రైతుల పంటల సాగుకు అందని నీరు ● పట్టించుకోని అధికారులు



సాహెబ్‌పేట్‌లో నిజాంసాగర్ కెనాల్‌లో కూలిన తూము



నిజాంసాగర్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీలో పెరిగిన పిచ్చిమొక్కలు

వేల్పూర్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండల పరిధిలోని గుత్ప లిఫ్ట్ ద్వారా నిజాంసాగర్ కెనాల్ డిస్ట్రిబ్యూటర్ కాలువలలో పిచ్చిమొక్కలు, ముళ్ళపొదలు, చెత్తచెదరం పూర్తిగా నిండి అనవాళ్ల కోల్పోయింది. 42వ డిస్ట్రీబ్యూటర్ ద్వారా సాహెబ్‌పేట్, అమీనాపూర్, వేల్పూర్‌కు వచ్చే కాలువలలో చెత్తచెదరంతో పాటు ఇరువైపుల పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. అంతేగాకుండా కాలువలో ఏపుగా పెరిగిపోయిన చెట్ల కొమ్మలు పడడంతో వాటికి నాచు తయారై సాగునీటి ప్రవహానికి అడ్డంగా ఏర్పడుతుంది. చెత్తచెదరంతో నీరు కాలుషితమవుతుంది. ఈ డిస్ట్రిబ్యూటర్ కాలువ ద్వారా ఆయా గ్రామాల చెరువులు, కుంటలకు నీరు నిండుతుంది. ఆ చెరువు కుంటల కింద వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుంది. కాలువకు అక్కడక్కడ ఏర్పాటు చేసిన తూములు, గ్రైడ్‌వాల్స్ కూలిపోవడంతో నీరు వృధాగా వెళ్ళే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాలువలకు అనవాళ్ల కోల్పోవడంతో గుత్ప ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని విడుదల చేస్తే పంటలకు అనుకున్నంత స్థాయిలో నీరందని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా వాటిని కాలువలో పెరిగిపోయిన పిచ్చిమొక్కలు, చెత్తచెదారాన్ని తొలగించి కూలిపోయిన తూములు, గ్రైడ్‌వాల్స్‌కు మరమ్మత్తులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కాల్వలకు సిమెంట్ లైనింగ్ చేయాలి



నిజాంసాగర్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పిల్లకాల్వలు, గ్రావిట్ కెనాల్‌కు సిమెంట్ లైనింగ్ చేయాలి కాలువలో ఉన్న పిచ్చిమొక్కలను తొలగించాలి. ఇరువైపుల ఉన్న కల్వర్టులను వెడల్పు చేయాలి.

- గొల్ల భూమన్న, రైతు, సాహెబ్‌పేట్

తూములకు షెటర్‌లు బిగించాలి



ప్రతీ తూముకు షెటర్‌లు బిగించాలి. అంతేగాకుండా శిథిలావస్థలో ఉన్న తూములకు మరమ్మతులు చేపట్టాలి. కెనాల్‌లో పెరుకుపోయిన పూడికను, ముళ్ళపొదాలను తొలగించాలి. తూముల వద్ద సిమెంట్‌తో బెడ్‌లు నిర్మించాలి.

- మొండి అశోక్, వేల్పూర్

ధాన్యం కొనుగోళ్లు సకాలంలో జరిగేనా.?



నవీపేట శివారులో ఆరబోసిన ధాన్యం రాసులు



ప్రైవేట్ వ్యాపారస్తులు కొనుగోలు చేసిన ధాన్యాన్ని తూకం వేస్తున్న హమాలీలు

నవీపేట,అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వానాకాలం సీజన్‌లో సమృద్ధిగా వర్షాలు కురియడంతో పంటల సాగు సాఫీగా సాగింది. ఇదే సీజన్ నుండి రాష్ట్ర ప్రభుత్వం సైతం సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో రైతుల ఆనందం రెట్టింపు అయింది. కాని భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరికోతలు ప్రారంభించి 20రోజులు దాటిపోయిన ఇప్పటికి ధాన్యం కొనుగోలు చేపట్టలేదు. దీంతో మండలంలో సగానికి పైగా రైతులు తమ వరిపంటను తక్కువ ధరకే దళారులకు విక్రయించుకున్నారు. మరికొందరు రైతులు ఖాళీ స్థలాలు, రోడ్ల పక్కన ధాన్యం రాసులు ఆరబోసుకుని రోజులు గడుస్తున్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో సన్నరకం ధాన్యంతో పాటు దొడ్డు రకం ధాన్యానికి సైతం క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ చెల్లించి కొనుగోలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

● ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

రాథోడ్ హీర్యా, రైతు, దర్యాపూర్ తండా, నవీపేట

ప్రతి సంవత్సరం ధాన్యం కొనుగోలు కేంద్రాలను దసరా పండుగ తర్వాత ప్రారంభించే వారు. ఈ సారి దీపావళి పండుగ దగ్గరికి వస్తున్న ఇప్పటికి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. ప్రభుత్వం ఎన్నికలకు ముందు సన్నరకం ధాన్యానికి క్వింటాలుకు 500రూపాయల చొప్పున బోనస్ చెల్లిస్తామని హామీ ఇచ్చారు. సన్నరకం ధాన్యంతో పాటు దొడ్డురకం ధాన్యానికి సైతం క్వింటాలుకు 500రూపాయల చొప్పున బోనస్ చెల్లించాలి. దీని ద్వారా రైతులందరికీ ప్రయోజనకరంగా ఉంటుంది.

● గత్యంతరం లేక ప్రయివేట్ వ్యాపారస్తులకు అమ్ముకుంటున్న రైతులు

సిరికొండ: ప్రభుత్వం ప్రారంభించే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యేలు, ఐడీసీఎంఎస్ అధ్యక్షుడు ఆగమేగాల మీద ప్రారంభించి ఎనిమిది రోజులు కావస్తున్న ధాన్యాన్ని మాత్రం కొనుగోలు చేయడం లేయక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సిరికొండ మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులు వాన కాలం పంటను కోస్తున్నారు. ధాన్యాన్ని కల్లాల్లో ఆరబోస్తున్నారు. తుఫాను ప్రభావం వల్ల వర్షాలు కురుస్తాయని భావించిన రైతులు ప్రయివేట్ వ్యాపారస్తులకు ధాన్యాన్ని విక్రయించుకోవడం ప్రారంభించడంతో ప్రభుత్వ ఆదేశాలతో పీఏసీఎస్, ఐడీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, ఐడీసీఎంఎస్ అధ్యక్షుడు తారచంద్‌నాయక్ ఆగమేగాల మీదా గ్రామాల్లో ప్రారంభించి వారం రోజులు గడిచి గడుస్తుంది. ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు చేయడం ప్రారంభించకపోవడంతో రైతుల్లో ఆందోళన మొదలయ్యింది. ధాన్యం ఎండిపోతుందని, బరువు తగ్గిపోతుందని రైతులు చెపుతున్నారు.కేంద్రాలను ప్రారంబించి వారం గడుస్తున్న నేటికి రైస్ మిల్లుల అలాట్‌మెంట్ చేయక పోవడం వల్ల రైతుల్లో ఆందోళన మొదలయ్యింది. ఇప్పటికే రైతుల్లో కొంత అసంతృప్తి మొదలయ్యింది.వానకాం పంట కోయడం పూర్తి కావస్తున్న నేటికి రైతు బరోస డబ్బులు వేయక పోవడంతో పాటు రూ.రెండు లక్షల రుణ మాఫి కాకపోవడం వల్ల రైతుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంటుంది. ప్రభుత్వం పట్ల కొంత మేరకు వ్యతిరేకత చిగురిస్తుంది. దాన్యం కొనుగోలు చేయడం ప్రారంబించక పోతే అగ్నికి ఆజ్యం పోసినట్లు అవుతుందని మరికొందరు రైతులు చెపుతున్నారు. ప్రభుత్వం రైస్ మిల్లుల అలాట్ మెంట్ చేసి వెంటనే దాన్యాన్ని వెంటనే కొనుగోలు ప్రారంబించాలని రైతులు కోరుతున్నారు.

బోధన్‌లో వైభవంగా త్యాగరాజ ఆరాధనోత్సవాలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం



సంగీత కచ్చేరి చేస్తున్న దృశ్యం



సంగీత కచ్చేరిలో పాల్గొన్న కళాకారులు

● నాదబ్రహ్మకు సుస్వరాల నివాళి
● సంగీతామృతం కురిపించిన సంగీత విద్వాంసులు
● ఆకట్టుకున్న సంగీత కార్యక్రమాలు

బోధన్‌రూరల్,అక్టోబరు27(ఆంధ్రజ్యోతి): లయబ్రహ్మ, నాదబ్రహ్మ, సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధన ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీ త్యాగరాజ స్వామి శతగల ఆరాధన ఉత్సవాలను ఆదివారం బోధన్ పట్టణంలోని శ్రీరామలయంలో నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. శ్రీనివాస్ ప్రతాప, గౌరి ప్రతాప కుటుంబ వంశస్థుల ఆధ్వర్యంలో ప్రతాప అన్నపూర్ణ, రామకృష్ణయ్యల జ్ఞాపకార్థం త్యాగరాజ కీర్తనలు, ఆరాధనోత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలు సంగీత ప్రియులకు ఎంతగానో అలరించి ఆకట్టుకున్నాయి. ఉదయం 11గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 2 గంటల వరకు సంగీత కచ్చేరి కొనసాగింది. రామాలయంలో సంగీత ప్రియులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వందమంది సంగీత విద్వంసులు ఒకచోట చేరి రామాలయ ప్రాంగణంలో తమ గానంతో అందరిని అలరించారు. భవిష్యత్‌లో సంగీతాన్ని ప్రతి ఒక్కరు ఆదరించాలని వక్తలు పేర్కొన్నారు. సంగీతం గొప్ప తనాన్ని వివరించారు. ముఖ్య అతిథులుగా న్యాయమూర్తి శేషతల్ప సాయి, అతిథులుగా కే.వెంకట నారాయణ, రాకేష్ వైద్య, యాదవ రావు, కాసర్ల నరేష్, సంగీత విద్వంసురాలు స్వప్నరాణి, వంద మంది సంగీత విద్వంసులు పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వాహకులు ప్రతాప శ్రీనివాస్, ప్రతాప గౌరి శంకర్ శాస్త్రి, ప్రతాప సత్యసాయిబాబా, సంగీత చార్యులు డాక్టర్ స్వప్నరాణి, డాక్టర్ నరేష్‌రావు, భాస్కర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

బీసీ కమిషన్ బృందానికి ఘనస్వాగతం



స్వాగతం పలుకుతున్న దృశ్యం

నిజామాబాద్‌అర్బన్,అక్టోబరు 27(ఆంధ్ర జ్యోతి): నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వచ్చిన బీసీకమిషన్ బృందానికి జిల్లా అధికారులు ఘనస్వా గతం పలికారు. ఆదివారం నగరంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహనికి వచ్చిన కమిషన్ చైర్మన్ నిరంజన్‌తో పాటు సభ్యులు రాపోలు జైప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మిలకు నిజామాబాద్ అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, ఆర్‌డీవో రాజేంద్రప్రసాద్, జిల్లా వెనుకబడిన తర గతుల అభివృద్ధి అధికారిణి ప్రవంతి ఘనస్వా గతం పలికారు. కమీషన్ చైర్మన్‌తో పాటు సభ్యు లు కొద్దిసేపు స్థానిక పరిస్థితులపై చర్చించారు. అనంతరం వారు బాసరలోని జ్ఞాన సరస్వతీ దేవస్థానం సందర్శన కోసం బయలుదేరి వెళ్లారు. సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో పాల్గొని రాత్రి నిజామాబాద్‌కు చేరుకుంటారు. మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు నగరంలోని సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలో ఉమ్మడి జిల్లాల ప్రజాభిసేకరణ కార్యక్రమంలో పాల్గొంటారని అన్నారు. ఉదయం 10 నుంచి 1గంట వరకు నిజామాబాద్, 2 నుంచి 4 వరకు కామారెడ్డి జిల్లాకు చెందిన వారు స్థానిక సంస్థల రిజర్వేషన్లపై తమ అభిప్రాయా లను రాతపూర్వకంగా కమీషన్‌కు నివేదించాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. స్వాగతం పలికిన వారిలో బీసీ అభివృద్ధి శాఖ సహాయ అధికారి నర్సయ్య, బీసీ స్టడీ సర్కిల్ అధికారి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

టపాకాయల దుకాణదారులు తప్పకుండా నిబంధనలు పాటించాలి



టపాకాయల వ్యాపారులతో మాట్లాడుతున్న ఏసీపీ

బోధన్‌రూరల్,అక్టోబరు27(ఆంధ్రజ్యోతి):టపాకాయల దుకాణదారులు తప్పకుండా నియమ, నిబంధనలు పాటించాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం లైసెన్స్‌లు తీసుకోవాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం బోధన్ పట్టణ సీఐ కార్యాలయంలో టపాకాయల దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టి టపాకాయల దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అగ్నిప్రమాదాల ప్రమాదాల నివారణ చర్యలను తప్పకుండా పాటించాలన్నారు. ఇళ్ల స్థలాల మధ్యలో టపాకాయల దుకాణాలను ఏర్పాటు చేయవద్దన్నారు. జనసంచారం ప్రాంతంలో టపాకాయలు అమ్మవద్దన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ వెంకట నారాయణతో పాటు పోలీసు సిబ్బంది తదితరులున్నారు.

అంత్యక్రియల్లో మాజీ మంత్రి,మాజీ ఎమ్మెల్యే,ఎమ్మెల్సీ



మోతె భూమన్న పాడె మోస్తున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ

డిచ్‌పల్లి, అక్టోబర్ 27 మండలంలోని రాంపూర్ మాజీ ఎంపీటీసీ మోతె భూమన్న ఆనారోగ్యంతో మృతి చెందాడు ఆదివారం జరిగిన ఆయన అంత్యక్రియల్లో మాజీ మంత్రి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మండవ వెంకటేశ్వరరావు, పాల్గొని భూమన్న పార్థివదేహనికి కు పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ లు అంత్యక్రియల్లో పాల్గొని మాజీ ఎంపీటీసీ భూమన్నకు నివాళ్లు అర్పించారు. గ్రామంలో జరిగిన అంత్యక్రయల్లో పాల్గొని పాడెమోశారు.

బాధితులకు ఫోన్ అందజేత



పోగొట్టుకున్న పోన్ అప్పగిస్తున్న ఎస్సై ఎల్.రామ్

సిరికొండ అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి) సిరికొండ మండలం లోని రావుట్ల, రామడుగు,గడ్కోల్ గ్రామాలకు చెందిన ముగ్గురు యువకులు పోగోట్టుకున్న మొబైల్ పోన్‌లను సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా ట్రేస్ చేసి పట్టుకుని బాధిత యువకులకు సిరి కొండ ఎస్సై ఎల్.రామ్ అప్పగించారు. రావుట్ల గ్రామానికి చెం దిన బాజన్నగారి అశోక్, రామడుగు ఒడ్డెర కాలనీకి చెందిన బొదా సు రమేష్, గడ్కోల్ గ్రామానికి చెందిన శరత్‌బాబు తమ మొ బైల్ పోన్‌లను పోగొట్టుకున్నారు. పోయిన ఫోన్‌లను పట్టుకుని ముగ్గురికి ఆదివారం అందజేశారు.

పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలి

భీమ్‌గల్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి) రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఉద్యోగ ఉపాధ్యాయులకు ఐదు వాయిదాల డీఏ పెండింగ్‌లో ఉండగా ప్రస్తుతం ఒక్క వాయిదాని మాత్రమే విడుదల చేయడం పట్ల టీఎస్‌యుటీఎఫ్ జిల్లా కార్యదర్శి మల్క జనార్ధన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆదివారం భీమ్‌గల్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లడుతూ జీవో 317సమస్యలపై దాటవేత వైకిరి పట్ల రాష్ట్రంలో ఉపాధ్యాయులంతా తీవ్రంగా నిరసిస్తున్నారని ఆయన తెలిపారు. గత ప్రభుత్వం వాయిదాలు బకాయి పెడితే ఈ ప్రభుత్వం వచ్చాక మరో రెండు వాయిదాలు వచ్చి చేరాయని కనీసం రెండు వాయిదాల డిఏ అయిన ఇప్పుడు ఇస్తారని ఉద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్న సందర్భంలో కేవలం ఒక్క వాయిదా డీఏ మాత్రమే విడుదల చేయడంతో ఉద్యోగులు జీర్ణించుకోలేకపోతున్నారని ఆయన అన్నారు. డీఏతో పాటు జీవో 317సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలని, ఇతర సమస్యల పరిష్కారం కోసం సీఎం హామీ ఇచ్చినట్టు మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించి సమస్యలన్నింటిని కాలయాపన లేకుండా పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

బీజేపీ సభ్యత్వ స్పెషల్ డ్రైవ్



ఆర్మూర్‌లో బీజేపీ సభ్యత్వను చేసుకుంటున్న మహిళలు

ఆర్మూర్‌టౌన్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి) పట్టణంలోని పలు కాలనీలో ఆదివారం బీజేపీ సభ్యత్వ స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు. పటణంలోని పాతబస్టాండ్, హుస్నాబాద్‌కాలనీ, 1300ప్లాట్లతో పాటు జిరాయత్‌నగర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా మోదీ నాయకత్వాన్ని బలపరుస్తూ కేంద్ర ప్రభుత్వ పాలనకు ఆకర్షితులై పలువురు యువకులు, మహిళలు స్వచ్ఛందంగా బీజేపీ సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్, పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, ప్రధానకార్యదర్శి మూల ఒడ్డెన్న, కోల రాము, తదితరులు పాల్గొన్నారు.

అనస్తీషియా వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ రమేష్

ఆర్మూర్‌రూరల్, అక్టోబరు27(ఆంధ్రజ్యోతి) అనస్తేషియా (మత్తు వైద్యులు) వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా ఆర్మూర్ డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ రమేష్ ఎన్నికయ్యారు. శనివారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అనస్తేషియా డాక్టర్‌ల సమావేశంలో డాక్టర్ రమేష్‌ను అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షునిగా సంవత్సరం పాటు బాధ్యతలు నిర్వహించనున్నారు. రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన డాక్టర్ రమేష్‌ను ఆర్మూర్ పట్టణంలోని పలువురు వైద్యులు, వైద్యసిబ్బంది అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

అయ్యప్ప దీక్షతో సమస్యలు దూరం

నిజామాబాద్ కల్చరల్,అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి):అయ్యప్ప దీక్షను చేపట్టిన భక్తులకు అయ్యప్ప అండగా ఉండి సమస్యలు దూరం చేస్తాడని భక్తులు విశ్వసిస్తారని అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ తెలం గాణ రాష్ట్ర కోశాధికారి శ్రీనివాస్‌గుప్త అన్నారు. ఆదివారం జరిగిన సమావేశంలో ఆయ న హాజరై మాట్లాడారు. అయ్యప్ప దీక్షతో ఎంతో మంది భక్తులు తమ సమస్యలను దూరం చేసుకున్నారని అయ్యప్ప దీక్ష ఎంతో మందిని ప్రభావితం చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గుప్పుమంటున్న.. గంజాయి

> 'గంజాయి అక్రమ.. రవాణాదారులు శ్మశాన వాటికలను సైతం వదలడం లేదు. శ్మశాన వాటికలు జన సంచారం లేకుండా ఉండడంతో రాత్రిపూట వాటిని అడ్డా చేసుకుని అక్రమ వ్యాపారానికి కొత్తగా తెర లేపారు. ఇటీవల బోధన్ పట్టణ శివారులోని శ్మశాన వాటిక వద్ద రెండు కిలోల గంజాయి అక్రమ రవాణాదారులను టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకోవడమే నిదర్శనం. గంజాయి విక్రయదారులు చివరికి శ్మశాన వాటికలను సైతం వదలడం లేదు. బోధన్‌లో చిన్నచిన్న కూరగాయల షాపుల్లో సైతం చిన్నచిన్న ప్యాకెట్‌లుగా తయారు చేసి గంజాయి దందా కొనసాగుతోంది.'


● బోధన్‌లో వైకుంఠధామం వద్ద గంజాయి విక్రయదారులను పట్టుకున్న పోలీసులు(ఫైల్)



● ఆచన్‌పల్లిలోని వైకుంఠధామం

ఆంధ్రజ్యోతి పరిశీలన

- బోధన్ డివిజన్‌తో పాటు జిల్లాను అవహిస్తున్న గంజాయి
- పట్టణంతో పాటు నగరంలో విచ్చలవిడిగా సాగుతున్న అమ్మకాలు
- యువతే లక్ష్యంగా విచ్చలవిడిగా అక్రమార్కుల దందా
- ఇతర రాష్ట్రాల నుంచి యథేచ్ఛగా దిగుమతి
- నియంత్రణలో ఎక్సైజ్ శాఖ, పోలీసులు విఫలం
- మత్తులో చిత్తవుతున్న యువత



బోధన్ రూరల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): బోధన్ డివిజన్‌తో పాటు జిల్లాను గంజాయి మత్తు అవహిస్తుంది. ఇటీవల గంజాయి రవాణాదారులు ఇతర రాష్ట్రాల నుండి వివిధ మార్గాలలో గంజాయిని పట్టణం, నగరానికి తీసుకువచ్చి విచ్చల విడిగా అమ్మకాలు చేపడుతున్నారు. యువతే లక్ష్యంగా చేసుకుని పలు ప్రాంతాలలో గంజాయి విక్రయాలు జోరుగా కొసాగుతున్నాయి. బోధన్ డివిజన్‌లో, జిల్లా కేంద్రంలో గంజాయి కేంద్రంలో ఆందోళన కలిగించే స్థాయికి చేరుకుంది. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే తప్పుడు ఆలోచనతో కొంతమంది ఇతర ప్రాంతాల నుండి తక్కువ రేటుకు గంజాయిని కొనుగోలు చేసి రకరకాల పద్దతులలో రవాణా చేసి ఇక్కడ అధిక రేటుకు గంజాయి అమ్మకాలకు పాల్పడుతున్నారు. గంజాయి అమ్మకాలు పట్టణం, నగరంలో జనాలు సంచరించే ప్రాంతాలు, దినసరి కూలీల అడ్డా, యువత, విద్యార్థులు ఎక్కువగా సమయం గడిపే ప్రధాన కూడళ్లు, రైల్వే స్టేషన్‌లు, బస్సు స్టేషన్‌లు, నిర్మానుష ప్రాంతాలను స్థావరాలు చేసుకుని గంజాయి వ్యాపారం జోరుగా సాగుతుంది. గంజాయి మత్తుకు అలవాటు పడిన వారు చిత్తవుతుంటే విక్రయదారులు లక్షల డబ్బులు సంపాదిస్తూ యదేచ్ఛగా చీకటి వ్యాపారం కొనసాగిస్తున్నారు.

చిన్నచిన్న ప్యాకెట్‌లలో విక్రయాలు

గంజాయి అమ్మకందారులు రకరకాల పద్ధతుల్లో ఎవరికీ అనుమానం రాకుండా గంజాయిని చిన్నచిన్న ప్యాకెట్‌లుగా చేసి అమ్ముతున్నారు. ఆయా ప్రాంతాలలో నిల్వ చేసి యువకులకు, దినసరి కూలీల వ్యసనాలను ఆసరాగా చేసుకుని అధిక రేటుకు అంటగడుతున్నారు. కోడ్‌లు చెప్పుకుంటూ అమ్మకాలు చేసుకోవడం గమనార్హం.

పెరుగుతున్న నేర ప్రవృత్తి

గంజాయి అమ్మకాలు జోరుగా సాగుతుండడం, విక్రయాలకు అడ్డు అదుపు లేకుండా పోవడంతో గంజాయి వ్యసనపరులు రాత్రి సమయాల్లో గంజాయికొనుగోలు చేసి సేవిస్తున్నారు. అర్ధరాత్రి వరకు గంజాయి సేవిస్తూ మత్తులో రాత్రి సమయాల్లో వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అనవసరంగా గొడవలు పడుతూ మత్తులో దారుణాలకు పాల్పడుతున్నారు. యువత గంజాయికి అలవాటు పడి తమ బంగారు భవిష్యత్‌ను బుగ్గిపాలు చేసుకుంటున్నారు. ఒకరికి ఈ వ్యసనం అలవాటు అయితే అది కాస్త చుట్టు ఉన్న వారికి వ్యాపిస్తుంది. ఒకరిని చూసి మరొకరు గంజాయి బారిన పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారు.

పోలీసులు పకడ్బందీ చర్యలు చేపట్టాలి

గంజాయి నియంత్రణలో పోలీసులు ఎంత అప్రమత్తంగా ఉన్న రవాణాదారులపై ఎంత నిఘా పెట్టిన అమ్మకాలు చాప కింద నీరులా విస్తరిస్తూనే ఉన్నాయి. శాంతిభద్రతల వైపు బోధన్ డివిజన్ పోలీసులు దృష్టి కేంద్రీకరించి మంచి పేరు తెచ్చి పెడుతున్న మరో వైపు గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గంజాయి అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపి అడ్డుకట్ట వేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. బోధన్, నవీపేట తదితర మండలాల్లో గంజాయి అక్రమ రవాణా పట్టుకున్న పట్టణంలో అనేకం ఉన్నాయి. పోలీసులు గంజాయి అమ్మకందారులను పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నప్పటికీ గంజాయి అమ్మకాలు మాత్రం ఆగడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతాం

: శ్రీనివాస్, బోధన్ ఏసీపీ



యువత గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి ఉక్కుపాదం మోపుతామని, గంజాయి అమ్మకాలు లేకుండా పకడ్బంది చర్యలు చేపడతామన్నారు. ఇటీవల గంజాయి అమ్మకాలు చేస్తున్న వారి రహస్య స్థావరాలను తెలుసుకుని నియంత్రించడం జరిగిందన్నారు. మరోమారు ఎవరైనా గంజాయి అక్రమ రవాణా చేసిన, విక్రయించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.


లారీలో ధాన్యం బస్తాలు నింపుతున్న హమాలీలు

రైతన్నల చూపు.. ప్రైవేట్ మిల్లర్ల వైపు!!

పెద్దకొడప్‌గల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): వానాకాలం (ఖరీఫ్) సీజన్‌లో రైతన్నలు తాము సాగచేసిన వరి పంటను చేతికి రావడంతో కోతలు పూర్తి చేసి ధాన్యంను ఆరబెట్టారు. ధాన్యం ఆరబెట్టిన రైతులు అమ్ముకోవడానికి ప్రభుత్వం గత వారం రోజుల కిందట ప్రతి సహకార సంఘం పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే కొనుగోలు కేంద్రాలలో ధాన్యంను ఇంక తూకం వేయకపోవడంతో రైతన్నలు తమ పంటను అమ్ముకోవడానికి ప్రయివేట్ మిల్లర్ల వైపు చూస్తున్నారు. గతంలో జుక్కల్ నిమోజక వర్గంలో దాదాపు అన్ని మండలాలలో ఉన్న రైతులు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలలో ధాన్యంను అమ్ముకున్నారు. అయితే ఈసారి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంబించిన కాంటాలు ప్రారంభం చేయకపోవడంతో ఆయా మండల కేంద్రాలతో పాటు గ్రామాల పరిధిలో ప్రయివేట్ మిల్లర్లు ధాన్యం కొనుగోలుకు ముందుకు వస్తున్నారు. క్వింటాలకు ధాన్యం ధర ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో రూ.2320 ఉండగా, ప్రయివేట్ మిల్లర్ల యజమానులు క్వింటాలుకు రూ.2250 చెల్లించడంతో పాటు, హమాలీ ఖర్చులు సైతం ప్రయివేట్ మిల్లర్లవారే చూసుకుండటంతో రైతులు ధాన్యాన్ని అమ్మివేస్తున్నారు. రహదారులపై ధాన్యం ఆరబెట్టడానికి సమయంతో పాటు కూలీల ఖర్చులు పెరగుతుండటంతో రైతన్నలు నిర్ణయం తీసుకుని ప్రయివేట్ వారికి తమ పంటను అమ్ముతున్నారు.


బీర్కూర్‌లో సబ్‌కలెక్టర్‌తో మాట్లాడుతున్న స్థానికులు

'యూ టర్న్ ఏర్పాటు చేస్తే ప్రమాదం'

బీర్కూర్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలో ప్రధాన రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా రోడ్డు మధ్యలో డివైడర్ నిర్మిస్తున్నారు. అయితే పాత పోస్టు ఆఫీస్ రోడ్డు ఎదుట నిబంధనలకు విరుద్ధంగా యూ టర్న్ ఏర్పాటు చేస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తంచేశారు. గల్లీలో నుంచి వచ్చే వాహనదారులు నేరుగా అవతలి వైపు దాటుతారని దీని వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని అన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గల్లీ రోడ్డుకు ఎదురుగా ఏర్పాటు చేసిన టూటర్న్‌ను మూసివేయాలన్నారు. ఇదిలా ఉండగా సబ్ కలెక్టర్ కిరణ్మయి బీర్కూర్‌కు విచ్చేశారు. స్థానికులు సబ్ కలెక్టర్‌ను కలిసి యూ టర్న్ ఏర్పాటు వల్ల జరిగే ప్రమాదాలను వివరించారు. యూటర్న్ ఏర్పాటు చేయకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ఫొటో న్యూస్


ఆకాశం కాషాయవర్ణంలోకి మారిన దృశ్యం

ఆకాశం అరుణారుణ వర్ణం!

ప్రపంచంలోని సమస్త జీవరాశులకు వెలుతురు ఇచ్చే సూర్యుడు సాయంత్రం వేళ అరుణవర్ణంలోకి మారడంతో ఆకాశం ఎరు పెక్కింది. మండలకేంద్రంలో ఆదివారం ఈ దృశ్యాన్ని స్థానికులు ఆసక్తి గా చూస్తుండగా 'ఆంధ్రజ్యోతి' కెమెరా క్లిక్ మనిపించింది. (- పెద్దకొడప్‌గల్)

కాలూరును కమ్మేస్తున్న మురికినీరు

● రైస్‌మిల్ నుంచి వస్తున్న మురికినీరు ● ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామీణ ప్రజలు ● ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోని అధికారులు ● ఆందోళనకు గురవుతున్న గ్రామస్థులు

మోపాల్, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రూరల్ పరిధిలోని కాలూరు గ్రామ చుట్టుపక్కల ఉన్న రైస్‌మిల్స్ నుంచి వస్తున్న మురికినీరు, దుమ్ము దూళితో గ్రామీణ ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామం చుట్టూ సుమారు 14 రైస్‌మిల్స్ ఉన్నాయని గ్రామస్తులు వివరించారు. కాలూరు గ్రామం నుండే కొండూరు, తిర్మన్‌పల్లి, పాల్దా, గుండారం, తదితర గ్రామాల ప్రజలు నిజామాబాద్ నగరానికి వస్తూ పోతుంటారు. కాలూరు గ్రామం చుట్టుపక్కల ఉన్న రైస్‌మిల్స్ నుండి దుమ్ము దూళితో పాటు మురికి నీరు ప్రవహించడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని కాలూరు గ్రామస్తులు మండిపడుతున్నారు. రైస్ మిల్స్ నుండి వస్తున్న దుమ్ము దూళి ఇప్పటికే అనేక మంది కళ్లలో పడటంతో ఆసుపత్రులపాలు అయ్యారని గ్రామస్తులు వివరించారు. ఈ రైస్ మిల్స్ నుంచి వచ్చే మురికినీరు కాలువల ద్వారా గ్రామ చుట్టుపక్కల ఉన్న చెరువుల్లోకి వదలడంతో చెరువు నీరు తాగి పశువులు మరణించిన సంఘటనలు ఉన్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు. రైస్‌మిల్స్ నుంచి వచ్చే మురికి నీటితో గ్రామస్తులు అనారోగ్య బారిన పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ మురికి నీరు ఎక్కువగా ప్రవహించడంతో దుర్వాసన వెదజల్లుతుందని రోడ్డుగుండా వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నగరానికి కూతదూరంలోనే కాలూరు, ఖానాపూర్ గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల చుట్టుపక్కల అనేక రైస్‌మిల్స్ వెలిసాయని గ్రామస్థులు పేర్కొన్నారు. ఉన్నతాధికారులకు ముడుపులను అంటగట్టి అనుమతులను తీసుకొస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రైస్‌మిల్స్ నుంచి వెలువడే మురికినీరుపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. వీటిపై చర్యలు తీసుకోకపోతే ఆందోళనకు వెనుకాడబోమని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు.

రైస్‌మిల్లులపై చర్యలు తీసుకోవాలి

: నారాయణ, గ్రామస్థుడు, కాలూర్



రైస్‌మిల్స్‌ను వెలువడుతున్న మురికి నీరు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఈ విషయమై అనేక సార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. రైస్‌మిల్స్ నుంచి వెలువడుతున్న దుమ్ము దూళితో పాటు మురికి నీరుతో గ్రామీణ ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి వస్తుంది. కాలూరు చుట్టుపక్కల గ్రామంలోనే 14 రైస్‌మిల్స్ ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి ఫోకస్


రైస్‌మిల్


రైస్‌మిల్ నుంచి వస్తున్న మురికినీరు

ప్రారంభోత్సవానికి ముస్తాబైన శిక్షణ కేంద్రం

● రైతు శిక్షణ కేంద్రం (కల్యాణ మండపం) ఎవరు ప్రారంభిస్తారో? ● అచ్చంపేట విండో ఆధ్వర్యంలో రూ.కోటి వ్యయంతో నిర్మాణం ● మాగి శివారులో 2ఎకరాల 20 గుంటలలో కేంద్రం ఏర్పాటు

నిజాంసాగర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నిజాంసాగర్ మండలం అచ్చంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో కోటి రూపాయలతో నిర్మించిన రైతు శిక్ష కేంద్రం, కళ్యాణ మండపం నిర్మాణం పూర్తయ్యింది. దీనిని ఎవరూ ప్రారంభిస్తారు అనేది ప్రశ్నార్థకంగా మారింది. మాగి గ్రామ శివారులోని రెండెకరాల 20 గుంటల ప్రభుత్వ భూమిలో ఈ రైతు శిక్షణా కేంద్రం కళ్యాణ మండపాన్ని రెండేళ్ల కింద నిర్మాణం చేపట్టేందుకు విండో అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టారు. ఈ విండో రైతు శిక్షణ కేంద్రంతో పాటు కల్యాణ మండపంగా వినియోగించుకోవడానికి అప్పట్లో సంఘ పాలకవర్గం తీర్మానించింది. ఈ రైతు శిక్షణ కేంద్రానికి సంఘ నిధులతోనే నిర్మాణం చేపట్టింది. రైతు శిక్షణ కేంద్రంలోనే రైతులకు శిక్షణ ఇవ్వడమే కాకుండా విరామ సమయంలో ఈ శిక్షణ కేంద్రంలోని కల్యాణ మండపంలో వినియోగించుకునేందుకు విండో అధికార యంత్రాంగం అనుమతులు జారీ చేసింది. కోటి రూపాయల వ్యయంతో రెండు ఏళ్ల పాటు నిర్మాణం చేపట్టిన రైతు శిక్షణ కల్యాణ మండపమని గత ఆరు నెలల కిందట నిర్మాణం పూర్తి చేశారు. రైతు శిక్షణ కేంద్రంలో కళ్యాణ మండపంతో పాటు డైనింగ్ హాల్ కూడా నిర్మాణం చేపట్టారు. కల్యాణ మండపంలో కావాల్సిన వంట సామగ్రి ఫర్నిచర్, తదితర ఎలక్ట్రిక్ వస్తువులను కూడా సమకూర్చింది. అంతేకాకుండా రెండు నెలల కింద కల్యాణ మండపం ప్రాంభించి జాతికి అంకితం చేసేందుకు పాలకవర్గం పూజలు జరిపేందుకు సన్నాలు జరిపింది. అయితే, అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ మంత్రులు, ఎమ్మెల్యే కల్యాణ మండపాన్ని ప్రారంబించలేక పోయారంటున్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మంత్రులు ఎమ్మెల్యేలు ప్రారంభిస్తారని మండ స్థాయి అధికారులు రెండో పాలకవర్గానికి హుక్కుమ్ జారీ చేశారు. దీంతో ఆరు నెలల కిందట ప్రాంభించే రైతు శిక్షణ కేంద్రం, కల్యాణ మండపానికి బ్రేక్ పడింది. రైతు శిక్షణ కేంద్రంలో కళ్యాణ మండపంలో మిగిలిపోయిన పనులన్నీ చకచక పూర్తి చేయించి తుది మెరుగులు దిద్దారు. అయితే రైతు శిక్షణ కల్యాణ మండపాన్ని ఎవరి చేతుల మీదుగా ప్రారంభిస్తారు అని విండో పాలకవర్గం పాటు రైతులు ఎదురు చూస్తున్నారు.


● ప్రారంభానికి ముస్తాబైన రైతు శిక్షణ కేంద్రం (కల్యాణ మండపం) ఇదే..

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

రాజంపేట, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలంలోని తలమడ్ల గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు చాకలి శ్రీనివాస్ ఇటీవల మరణించడంతో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఆదివారం అతనికుటుంబాన్ని పరామర్శించారు. మనోధైర్యం కల్పించి బీజేపీ వారికి అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి నరేందర్‌రెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు



ఎమ్మెల్యే సమక్షంలో బీజేపీలో చేరిన భూమేష్‌యాదవ్

కామారెడ్డిటౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): భారత్‌ను విశ్వగురువుగా చేయాలన్నదే నరేంద్రమోదీ కల అని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. ఆదివారం కామారెడ్డి పట్టణంలోని 15వ వార్డుకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు భూమేష్ యాదవ్‌తో పాటు 21 మంది బీజేపీలో చేరారు.20 వవార్డులోని పలువురు మైనార్టీలు బీజేపీలో చేరగా వారికి కండువాకప్పి ఎమ్మెల్యే ఆహ్వానించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్ కోసం అహర్నిశలు కష్టపడి పీఎం నరేంద్రమోదీ పనిచేస్తున్నారని 10 ఏళ్లకాలంలో బీజేపీ కాశ్మీర్ నుంచి కన్యకుమారి వరకు అన్ని ప్రాంతాల్లో బలోపేతం అయిందని అన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కామారెడ్డిలోని అన్ని వార్డులను గెలుచుకుని బీజేపీ కైవసం చేసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు ప్రవీణ్, నరేందర్, శ్రీనివాస్, నాయకులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను కూలగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ఫిర్యాదు

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జీవీఎస్ కళాశాల ఎదుట ఉన్నరోడ్డు డివైడర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు కూల్చివేశారని వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ సింధూశర్మకు ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఫిర్యాదుచేశారు. ప్రమాదాలు జరగకుండా వెంటనే కూల్చిన డివైడర్‌ను నిర్మించాలని కలెక్టర్‌ను కోరారు.

నూతన వధూవరులకు ఎమ్మెల్యే ఆశీర్వాదం

భిక్కనూరు: మండలంలోని సిద్దరామేశ్వరనగర్ గ్రామానికి చెందిన బత్తుల సుశీల-రాములు దంపతుల కుమార్తె లాస్య-రంజిత్ వివాహానికి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు

నేటి నుంచి బీసీ కమిషన్ విజ్ఞప్తుల స్వీకరణ

మద్నూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి 13 నవంబరు వరకు 17 రోజుల పాటు బీసీ కమిషన్ విజ్ఞప్తుల స్వీకరణ కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ ముజీబ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటన చేస్తున్న సందర్భాన్ని సద్వినియోగం చేసుకుని ఆయా జిల్లాల నాయకులు బీసీలకు కావాల్సిన వివిధ అంశాలపై విజ్ఞప్తులను సమర్పించాలని కోరారు. ఆయా ఉమ్మడి జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల్లో బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులకు విజ్ఞప్తులు సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 28 అక్టోబరు ఆదిలాబాద్, 29న అక్టోబరు నిజామాబాద్ ఉమ్మడి జిల్లా, 30న అక్టోబరు సంగారెడ్డి, నవంబర్ 1 కరీంనగర్, 2 నవంబర్ వరంగల్, 4 నవంబర్ వరంగల్, 5 నవంబర్ ఖమ్మం, 7న నవంబర్ రంగారెడ్డి, 8న నవంబరు మహబూబ్‌నగర్, 11న నవంబర్ హైదరాబాద్, 12, 13 నవంబర్ కమిషన్ కార్యాలయంలో బీసీ చైర్మన్ మరియు కమిషన్ సభ్యులు అందుబాటులో ఉంటారు. కుల గణన,స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, చట్ట సభల్లో రిజర్వేషన్లు, మహిళా రిజర్వేషన్లు, పారిశ్రామిక రంగంలోయ సబ్సిడీలు, భూముల కేటాయింపులు, విద్యా ఉద్యోగ ఉపాధి రంగంలోయ బీసీల జనాభా దామాషా రిజర్వేషన్లు, బీసీ సబ్ ప్లాన్, బడ్జెట్‌లో వాటా, వివిధ కుల వృత్తుల వారికి, సేవా కులాల వారికి ప్రత్యేక సబ్సిడీ పథకాలు, బీసీ కులాల ఉత్పత్తిలకు గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయి ప్రత్యేకమైన సేజ్‌లు, బీసీ కులాల వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం వంటి అంశాలతో పాటు కులాల వారీగా సమస్యలపై విజ్ఞప్తులు స్వీకరిస్తారని కావున మద్నూర్ మండల బీసీ కులాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

రేపు ఎల్లారెడ్డిలో రక్తదాన శిబిరం

ఎల్లారెడ్డి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా మంగళవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో రక్తదాన శిబిరం ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆదివారం ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్లడ్ డోనేషన్ చేసే వారు ఎల్లారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

బోధన్‌లో వైభవంగా త్యాగరాజ ఆరాధనోత్సవాలు

బోధన్‌రూరల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): లయ బ్రహ్మ, నాదబ్రహ్మ, సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధన ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీ త్యాగరాజ స్వామి శతగల ఆరాధన ఉత్సవాలను ఆదివారం బోధన్ పట్టణంలోని శ్రీరామలయంలో నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. శ్రీనివాస్ ప్రతాప, గౌరి ప్రతాప కుటుంబ వంశస్థుల ఆధ్వర్యంలో ప్రతాప అన్నపూర్ణ, రామకృష్ణయ్యల జ్ఞాపకార్థం త్యాగరాజ కీర్తనలు, ఆరాధనోత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలు సంగీత ప్రియులకు ఎంతగానో అలరించి ఆకట్టుకున్నాయి. ఉదయం 11గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 2 గంటల వరకు సంగీత కచ్చేరి కొనసాగింది. రామాలయంలో సంగీత ప్రియులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వందమంది సంగీత విద్వాంసులు ఒకచోట చేరి రామాలయ ప్రాంగణంలో తమ గానంతో అందరిని అలరించారు. భవిష్యత్‌లో సంగీతాన్ని ప్రతి ఒక్కరు ఆదరించాలని వక్తలు పేర్కొన్నారు. సంగీతం గొప్ప తనాన్ని వివరించారు. ముఖ్యఅతిథులుగా న్యాయమూర్తి శేషతల్ప సాయి, అతిథులుగా వెంకట నారాయణ పాల్గొన్నారు.

యువత ఐటీఐ కోర్సులను సద్వినియోగించుకోవాలి

● సబ్ కలెక్టర్ కిరణ్మయి



అన్నారంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

బీర్కూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): యువకులు శిక్షణా నైపుణ్యాలు, ఉపాధి అవకాశాలను పెంపొందించుకునేందుకు బిచ్కుంద ఐటీఐలో ఏర్పాటు చేసిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్‌లో చేరాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి యువతకు పిలుపునిచ్చారు. ఆదివారం ఆమె బీర్కూర్ మండలం అన్నారం గ్రామానికి విచ్చేశారు. గ్రామంలో విద్యార్థులు, యువకులు, గ్రామ పెద్దలతో సమావేశమయ్యారు. బిచ్కుందలోని ఐటీఐ ఏటీసీ విభాగంలో 2024 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు ప్రారంభ మయ్యాయని తెలిపారు. కొత్తగా ఆరు రకాల కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు, ఇంటర్ చదువుతూ మానేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామ స్థాయి అధికారులు విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మహబూబ్, కార్యదర్శులు మురళి, గ్రామ పెద్దలు, యువత తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులు



బీర్కూర్‌లో సబ్ కలెక్టర్‌తో మాట్లాడుతున్న స్థానికులు

బీర్కూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలో ప్రధాన రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా రోడ్డు మధ్యలో డివైడర్ నిర్మిస్తున్నారు. అయితే పాత పోస్టు ఆఫీస్ రోడ్డు ఎదుట నిబంధనలకు విరుద్ధంగా యూ టర్న్ ఏర్పాటు చేస్తున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తంచేశారు. గల్లీలో నుంచి వచ్చే వాహనదారులు నేరుగా అవతలి వైపు దాటుతారని దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గల్లీ రోడ్డుకు ఎదురుగా ఏర్పాటు చేసిన టూటర్న్‌ను మూసివేయాలన్నారు. ఇదిలా ఉండగా సబ్ కలెక్టర్ కిరణ్మయి బీర్కూర్‌కు విచ్చేశారు. స్థానికులు సబ్ కలెక్టర్‌ను కలిసి యూ టర్న్ ఏర్పాటు వల్ల జరిగే ప్రమాదాలను వివరించారు. యూటర్న్ ఏర్పాటు చేయకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

'సకాలంలో చేప పిల్లలు పంపిణీ చేయడం లేదు'

భిక్కనూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు సకాలంలో సబ్సిడీ చేప పిల్లలను పంపిణీ చేయ్యడం లేదని జిల్లా మత్స్య సహకార సంఘం మాజీ డైరెక్టర్ దాసరి నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లా వ్యాప్తంగా దాదాపు అన్ని చెరువులు, కుంటలు నిండాయని, కానీ ప్రస్తుతం వాటిలో చాలావరకు నీరు అడుగంటే స్థితికి చేరుకున్నాయని అయినా ఇప్పటివరకు ప్రభుత్వం చేప పిల్లలను పంపిణీ చేయ్యకపోవడం సిగ్గుచేటన్నారు. అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయి ఆర్చరీకి ఎంపికైన గడి కోట విద్యార్థులు



రాష్ట్రస్థాయి ఆర్చరీకి ఎంపికైన గడికోట విద్యార్థులు

దోమకొండ, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ అండర్ - 19 రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు మండల కేంద్రంలోని గడికోట విద్యార్థులు నవీన్, రుత్విక్ ఎంపికైనట్లు కోచ్ ప్రతాప్‌దాస్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా కోచ్ మాట్లాడుతూ ఈ నెల 29న కరీంనగర్ జిల్లాలోని కొత్తపేట మినీ గ్రౌండ్లో నిర్వహించే రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ ఆర్చరీ పోటీల్లో వీరు పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ



భిక్కనూరులో సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేస్తున్న దృశ్యం

భిక్కనూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండల కేంద్రంలోని వ్యవసాయమార్కెట్ కార్యాయలంలో ఆదివారం మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన మధుసూధన్‌కు, మండలంలోని ర్యాగట్లపల్లి గ్రామానికిచెందిన మధుసూధన్‌రెడ్డికి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను గ్రంథాల సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాజు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గాల్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ కులస్థులను ప్రభుత్వాలు అణచి వేస్తున్నాయి

దోమకొండ, (బీబీపేట) అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముదిరాజ్ కులస్తులను అణచివేస్తున్నాయని బీబీపేట మాజీ ఎంపీటీసీ కొరివి నీరజ నర్సింలు అన్నారు. ఆదివారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. 2011 జనాభా లెక్కల ప్రకారం..70 లక్షల జనాభా ఉన్న ముదిరాజ్‌లు కోటి వరకు ఉందని తమను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అణచి వేస్తున్నాయన్నారు. జనగణన తర్వాత ముదిరాజ్‌లకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కోటికి పైగా ఉన్న ముదిరాజ్‌లకు ప్రత్యేకంగా 10 శాతం రిజర్వేషన్ కమిషన్ ఏర్పాటు చేసి పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. లేనియెడల రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామన్నారు. ముదిరాజ్ కులవృత్తుల వారికి ప్రత్యేక సబ్సిడీ పథకాలు ఇవ్వాలన్నారు. ముదిరాజ్‌లకు విద్య, ఉపాధి, వివిధ రంగాలలో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.



భూమిపూజ చేస్తున్న కాంగ్రెస్ మండల నాయకుడు శీలాసాగర్

పోసానిపేట్‌లో గ్రామ దేవతల నిర్మాణానికి శంకుస్థాపన

రామారెడ్డి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండలం పోసానిపేట్ గ్రామంలో ఆదివారం ఆరు గుడిల నిర్మాణం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామదేవతలు మత్తడి పోశమ్మ, ఐదు చేతుల పోశమ్మ, లక్ష్మమ్మ, దుర్గమ్మ, ముత్యాలమ్మ, మారెడ్డి పోశమ్మ (ఆరుగుళ్ల) నూతన నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. గ్రామాభివృద్ధి కమిటీ, రాజకీయ నేతల నేతృత్వంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే కల్వకుంట్ల మదన్ మోహన్‌రావుకు క్యాబినెట్‌లో మంత్రి పదవి రావాలని కాంగ్రెస్ రామారెడ్డి మండల వర్కింగ్ అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ శీలా సాగర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నారెడ్డి దశ రథ్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు, గ్రా మ మాజీ సర్పంచ్ గీరెడ్డి మ హేందర్‌రెడ్డి, డాక్టర్ సూర్యాల జిస్టు గీరెడ్డి రవీందర్ రెడ్డి, అఖిల పక్ష నేతలు గీరెడ్డి శంకర్‌రెడ్డి, అడ్వకేట్ శివారెడ్డి, వీడీసీ అ ధ్యక్షుడు శనగరం సాయిలు, ఆలయ నూతన నిర్మాణ కమిటీ అధ్యక్షులు గంద్ర నర్సింలు, ఉపాధ్యక్షులు గాండ్ల సాయిలు, సెక్రటరీ శివరాజం, పోతుల రాజేందర్, మొలిగ నరసింహులు, సాయిలు, గ్రామ రైతు బంధు అధ్యక్షులు సీహెచ్ తిరుపతి, నాయకులు బండి నరసింహులు, రాజు, టంకరి రవి, సుద్దాల లింగం, నారెడ్డి రాజిరెడ్డి, బండి పోచయ్య, పోతుల బాపురెడ్డి, బట్టు సత్యనారాయణ, సీహెచ్ బాస్కర్ పాల్గొన్నారు.

అపూర్వం..విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



రెంజర్ల ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ముప్కాల్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ముప్కాల్ మండలంలోని రెంజర్ల ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మే ళనంగా ఘనంగా నిర్వహించారు. 1995-96 సంవత్సరానికి చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు 29 ఏళ్ల తర్వాత ఒకే చోట కలుసుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి గురువులు ప్రధానో పాధ్యాయులు కోండ్ర ధన్‌పాల్‌ల దంపతులకు గంగాధర్, సాయిరెడ్డి, ఉపాధ్యాయులతో పాటు సుభాషిణిని శాలువతో సత్కరించుకొని మెమెంటోలు అందజేశారు. ఉపాధ్యాయులు అనాటి విద్యార్థుల చిలిపి చేష్టలను గుర్తు చేసుకున్నారు. విద్యార్థులు ఒకరి నొకరు కష్టసుఖాలు తెలుసుకొని ఎటువంటి అపద సమయంలో నైనా ఒకరినొకరు సహకరించు కుంటామని తమ మనోభావాలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మగ్గిడి ముత్యంరెడ్డి, నిమ్మల శ్రీనివాస్ పాల్గొన్నారు.

'కేబినెట్ నిర్ణయాలు సహేతుకంగా లేవు'



సమావేశంలో మాట్లాడుతున్న టీపీటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి అనిల్

కామారెడ్డిటౌన్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): కేబినెట్ నిర్ణయాలు సహేతుకంగా లేవని, ఉపాధ్యాయ, ఉద్యోగులలో తీవ్ర అసంతృప్తి నెలకొందని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పా టుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదు వాయిదాల కరువుభత్యం పెండింగ్‌లో ఉండగా ప్రస్తుతం ఒక వాయిదాను మాత్రమే విడుదల చేయడం, జీవో 317 సమస్యలపై దాటవేత వైఖరి ప్రదర్శించడం తగదన్నారు. ఎన్నికల సందర్భంగా అధికారంలోకి వచ్చిన పదిహేనురోజుల్లో బకాయి పడిన మూడు వాయిదాల డీఏ విడుదల చేస్తామని, సీపీఎస్ రద్దుచేస్తామని, జీవో 317 బాధితులందరికి న్యాయం చేస్తామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొందని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని పదినెలలుగా ప్రభుత్వంపై ఒత్తిడి చేయకుండా ఓపిక పట్టామని సగం మందికైన మొదటితేదిన వేతనాలు ఇస్తున్నందున సంతోషమన్నారు. గత ప్రభుత్వం మూడు వాయిదాలు బకాయిపడితే రెండు వాయిదాల డీఏ అయిన ఇప్పుడు ఇస్తారని ఆశగా ఎదురుచూస్తే కేవలం ఒక వాయిదా ఇచ్చి నిరాశ పరిచారన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యవర్గసభ్యులు నాగభూషణం, శ్రీనివాస్, లింగం, రూప్‌సింగ్, నళిని దేవి, లక్ష్మీ పాల్గొన్నారు.

పండుగకు ముందే పేకాట

(3వ పేజీ తరువాయి)

జోరుగా జూదం కొనసాగుతోంది. గతంలో జిల్లా కేంద్రంతో పాటు బాన్సువాడ, ఎల్లారెడ్డి, నిజామాబాద్ జిల్లాలో పేకాట క్లబ్బులను నిర్వహించిన నిర్వాహకులు అటవీ ప్రాంతాలను అడ్డాలుగా ఏర్పాటు చేసుకొని జూదం కొనసాగిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. మందు, విందులను సైతం నిర్వాహకులు ఏర్పాటు చేస్తూ జోరుగా పేకాటను నిర్వహిస్తున్నారు. ఈ దీపావళికి సైతం ఈ ప్రాంతాల్లో లక్షల రూపాయలతో జూదాన్ని కొనసాగించేందుకు నిర్వాహకులు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతాలపై పోలీసులు నిఘా పెట్టి పండుగ రోజు ఎలా కట్టడి చేస్తారో వేచి చూడాలి.

ఖండేబల్లూర్‌లో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెద్దకొడప్‌గల్, అక్టోబరు 27: జుక్కల్ మండలంలోని ఖండేబల్లూర్ గ్రామంలో ఆదివారం కేపిల్ క్రికెట్ టోర్నమెంట్‌ను కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. మారుమూల గ్రామాల్లో ఉన్న యువతలో క్రీడలపై ఆసక్తిని పెంచడానికి ఈ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ యువతకు క్రికెట్ పోటీలలో సామర్థ్యాన్ని పెంపొందించడానికి పోటీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని తెలిపారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ ఈ పోటీలకు తెలంగాణ, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలకు చెందిన సుమారు 60 టీంలు పాల్గొన్నాయని, ఇందులో ప్రతీ రోజు లీగ్ మ్యాచ్ నిర్వహించనున్నామని తెలిపారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన జట్టుకు రూపాయలు 55, 555 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు 25, 555 రూపాయలు బహుమతి అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ నియోజకవర్గ అధ్యక్షులు అరవింద్, మాజీ సర్పంచ్‌లు శివరాజ్ దేశాయ్, సాయిలు, నిర్వాహకులు అరవింద్, ముజీబ్, రవీందర్, షకీల్ పాల్గొన్నారు.

జంగమాలు అన్ని రంగాల్లో రాణించాలి

● జంగమ రాష్ట్ర అధ్యక్షుడు విశ్వేశ్వరయ్య



జంగమ సంఘం జిల్లాస్థాయి సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు

ఎల్లారెడ్డి, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): జంగమా సమాజ కుటుంబ సభ్యులు అన్నిరంగాల్లో రాణించాలని రాష్ట్ర అధ్యక్షుడు విశ్వేశ్వరయ్య అన్నారు. ఆదివారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని బిందర్ కిరాణా వర్తక సంఘంలో జంగమ సంఘం జిల్లాస్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు విశ్వేశ్వరయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ ఐక్యంతో ఉండి జంగమ సంఘం సభ్యులు అన్ని రంగాల్లో ముందుండాలని తెలిపారు. అదేవిధంగా దేశాన్ని ధర్మాన్ని కాపాడుకోవడానికి ముందుండాలని పలు సూచనలు ఇచ్చారు. రాష్ట్రస్థాయిలో పదో తరగతి ఇంటర్, డిగ్రీలో అలాగే ఉత్తమ ర్యాంకు సాధించిన వారికి అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జంగం సుభాష్ అప్ప, నియోజకవర్గ ఇంచార్జి అధ్యక్షుడు జంగం సుభాష్ అప్ప, నియోజకవర్గ ఇంచార్జి అధ్యక్షుడు జంగం శంభు లింగం, జంగం శేఖర్ అప్ప పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

లింగంపేట, అక్టోబర్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్పల్లిసంగారెడ్డి గ్రామ సమీపంలో శనివారం రాత్రి బైక్ కారు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయినట్లు గ్రామస్తులు తెలియజేశారు. శెట్పల్లిసంగారెడ్డి గ్రామానికి చెందిన మామిడి సాయిలు, చెన్నవ్వ, బాలవ్వలు ద్విచక్ర వాహనంపై వరి ధాన్యం ఆరబెట్టేందుకు వెళ్లుతుండగా అటుగా వచ్చిన కారు ఢీకొనడంతో సాయిలుకు కాలు విరగగా, చెన్నవ్వ పరిస్థితి విషమంగా ఉందని గ్రామస్థులు తెలిపారు.

క్రీడాకారులకు క్రికెట్ కిట్ల అందజేత



క్రికెట్ కిట్లను అందజేస్తున్న దృశ్యం

భిక్కనూరు, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని బస్వాపూర్ గ్రామంలో క్రీడాకారులకు ఆదివారం గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త పందిరి రాజిరెడ్డి క్రికెట్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో చాలామంది క్రిడాకారులు ఉన్నారని వారు క్రీడల్లో రాణించడానికి తనవంతు పూర్తి సహకారాన్ని అందజేస్తానని తెలిపారు. ముఖ్యంగా గ్రామయువతకు అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు, యువకులు పాల్గొన్నారు.

శబరిమలకు పాదయాత్రగా బయలుదేరిన భక్తులు

మద్నూర్, అక్టోబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మద్నూర్ మండలం నుంచి శబరిమల అయ్యప్ప సన్నిధానికి పాదయాత్రగా వెళ్లిన భక్తులను మద్నూర్‌లో సన్మానించారు. మండలం నుంచి ప్రతి ఏడాది శబరిమలైకి అయ్యప్ప స్వాములు పాదయాత్రతో బయలుదేరి వెళుతుంటారు. ఈ ఏడాది సైతం మండలంలోని ఆయా గ్రామాల నుంచి అయ్యప్పలు ఒక బృందంగా ఏర్పడి శబరిమలకు పాదయాత్రగా బయలుదేరారు. వారు మద్నూర్ మండల కేంద్రానికి ఆదివారం చేరుకోవడంతో గ్రామస్తులు వారికి సన్మానించారు. ఈసందర్భంగా గురుస్వామి సాయాగౌడ్ మాట్లాడుతూ అయ్యప్పస్వామిని కొలిస్తే కోరికలు నెరవేరుతాయనే నమ్మకం మాకుందన్నారు. పాదయాత్రగా బయలుదేరిన వారు డిసెంబర్ 12వ తేదీకి శబరిమల చేరుకుంటారన్నారు. అడుగడుగునా వారికి భక్తులు సన్నిధానం ఏర్పాటు చేస్తారన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి	- దేవర
దర్శన్	- ద లాస్ట్ డ్యాన్స్ పాట్టేల్
ప్రియా 35	- విశ్వం
ప్రియా 70	- లగ్గం

బాన్సువాడ

మహేశ్వరి	- వేట్టయన్ (ది హంటర్)
వెంకటేశ్వర	- విశ్వం

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	160	200	220
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

